AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in


## భవిత కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ మండల విద్యా వనరుల కేంద్రం లోని భవిత కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ ఇలా త్రిపాఠి పరిశీలించారు. ఆమె వెంట సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా, తహశీల్దార్ సత్యనారాయణ, ఎంఈవో రాజగంగారం, సిబ్బంది పాల్గొన్నారు.





## కేసుల దర్యాప్తులో పారదర్శకతను పెంచాలి: ఎస్పీ రాజేష్ చంద్ర

**అక్షరటుడే, కామారెడ్డి:** కేసుల దర్యాప్తులో పారదర్శకతను పెంచాలని ఎస్పీ రాజేష్ చంద్ర పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులతో నెలవారీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతిని డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలతో కలిసి సమీక్షించారు. కేసు ఫైళ్లను పరిశీలించి తీవ్రమైన నేరాల్లో దర్యాప్తును వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమంపై ఎస్పీ ప్రత్యేక దృష్టి సారిస్తూ పీపీటీ ప్రజెంటేషన్ ద్వారా ప్రమాద పరిస్థితులను సమీక్షించి, ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న బ్లాక్ స్పాట్‌లను గుర్తించి అక్కడ సైన్ బోర్డులు, హెచ్చరిక బోర్డులను తక్షణమే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రహదారులకు అడ్డుగా ఉన్న పొదలను తొలగించాలన్నారు. వేసవి కాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో చోరీలు జరగకుండా రాత్రిగస్తీని, బీట్లను ముమ్మరం చేయాలన్నారు. అదనపు ఎస్పీ నరసింహారెడ్డి, ఏఎస్పీ చైతన్య రెడ్డి, డీఎస్పీలు శ్రీనివాసరావు, విఠల్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ మురళి, సీసీయస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, జిల్లాలోని సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



## తాగునీటి సమస్య రాకుండా చూస్తాం..

### కామారెడ్డి మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఉమారాణి

**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి పట్టణంలో వేసవిలో తాగునీటి సమస్య రానివ్వమని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి తెలిపారు. బుధవారం ఆమె మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లతో కలిసి బుర్రమత్తడి ఫిల్టర్ బెడ్ పనులను పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు నీటి ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఉమారాణి అధికారులను ఆదేశించారు. తాగునీటి ఎద్దడి తలెత్తకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలన్నారు. బుర్రమత్తడి వద్ద ప్రస్తుతం ఉన్న వనరులకు అదనంగా మరో మూడు కొత్త బోర్లు వేయించాలని, వీటికి అంతరాయం లేని విద్యుత్ సరఫరా కోసం ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ రాజేందర్ రెడ్డి, ఏఈ వేణు ప్రసాద్‌లకు ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా ఫిల్టర్ బెడ్ల వద్ద పరిశుభ్రత విషయంలో రాజీ పడకూడదని, ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలని ఛైర్మన్ సూచించారు. ప్రతి ఇంటికి తాగునీరు సక్రమంగా అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేందర్ రెడ్డి, ఏఈ వేణు ప్రసాద్‌లతో పాటు మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

"నా భర్త రాజకీయాల్లో చురుకుగా పాల్గొంటే.. చేదోడు వాదోడుగా ఉండేదాన్ని.. అప్పుడప్పుడు సలహాలు.. సూచనలు కూడా అందించేదాన్ని.. కానీ నేను మేయర్ అవుతానని కలలో కూడా అనుకోలేదు" అని నిజామాబాద్ కార్పొరేషన్ మేయర్ ఉమారాణి అన్నారు. ఇటీవల మేయర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన ఆమె.. 'అక్షరటుడే'తో బుధవారం మాట్లాడారు.

– అక్షరటుడే, ఇందూరు

# మేయర్ అవుతానని అనుకోలేదు..



- అందరికీ సంక్షేమ ఫలాలు అందేలా కృషి
- అధికారులు.. కార్పొరేటర్ల సమన్వయంతో ముందుకు..
- మేయర్ ఉమారాణితో 'అక్షరటుడే' ప్రత్యేక ఇంటర్వ్యూ

మాది సాధారణ కుటుంబం. నా విద్యాభ్యాసం పద్మశాలి పాఠశాల, కోటగల్లి ప్రభుత్వ పాఠశాలలో సాగింది. డిగ్రీ ఓపెన్ యూనివర్సిటీలో చేశాను. నా భర్త రమేశ్ వ్యాపారంతో పాటు కరాటేలో శిక్షణ ఇచ్చేవారు. గతంలో నేను ప్రైవేటు టీచర్‌గా, టైలరింగ్ చేస్తూ కుటుంబానికి అండగా నిలిచేదాన్ని. గత రెండేళ్లుగా గృహిణిగా ఉంటున్నాను. అసలు కార్పొరేటర్‌గానే నిలబడతాననుకోలేదు అలాంటిది ఏకంగా మేయర్‌గా అవకాశం వచ్చింది. ప్రస్తుతం నాపై ఎంతో బాధ్యత ఉంది. నా డివిజన్ వాసులతో పాటు నగర ప్రజలకు అండగా నిలుస్తాను. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు అందరికీ అందేలా నా వంతు కృషి చేస్తాను.

### నగర సమస్యలపై అవగాహన

నగరంలోని సమస్యలపై నాతోపాటు నా భర్త రమేశ్‌కు అవగాహన ఉంది. అధికారులను సమన్వయం చేసుకుని నగరపాలక సంస్థ సిబ్బంది సహకారంతో పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు కృషి చేస్తాను. ప్రధానంగా డ్రెయినేజీ, రోడ్ల సమస్య, ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు రుణాలు తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తాను. ఎప్పటికప్పుడు అధికారులతో సమావేశాలు నిర్వహిస్తూ.. ప్రగతి నివేదికలను పరిశీలించేలా ప్రత్యేక ప్రణాళికను రూపొందిస్తాను. రాష్ట్రంలో మా ప్రభుత్వం ఉన్నందున అభివృద్ధి వేగంగా జరిగేలా ముందుకు సాగుతాను. మధ్య తరగతి కుటుంబాల జీవితం.. వారి బాధలు నాకు తెలుసు. కాబట్టి నా మొదటి ప్రాధాన్యత వారి సమస్యల పరిష్కారంపైనే ఉంటుంది.

### నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తా

పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ దగ్గర నా భర్త రమేశ్ 42 ఏళ్లుగా రాజకీయ శిష్యుడిగా ఉన్నారు. కరాటేలోనూ శిష్యరికం చేసి అనేకమంది విద్యార్థులను ఉత్తమంగా తీర్చేదిద్దారు. మాపై నమ్మకంతో మేయర్ బాధ్యతలను అప్పజెప్పారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా.. పెద్దలందరి సహకారంతో వారి సూచనలతో నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతాను. ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తాను.



## ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి షబ్బీర్ అలీపై గెలవాలి

**అక్షరటుడే, కామారెడ్డి:** ఎమ్మెల్యేకు దమ్ముంటే తన పదవికి రాజీనామా చేసి తమ నాయకుడు షబ్బీర్ అలీపై గెలవాలని కాంగ్రెస్ నాయకులు సవాల్ విసిరారు. నియోజకవర్గ కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం మీడియాతో మాట్లాడారు. షబ్బీర్ అలీని దూషిస్తే ఎమ్మెల్యే తన తండ్రిని దూషించినట్టేనన్నారు. ఎమ్మెల్యేకు రాజకీయ భిక్ష పెట్టింది షబ్బీర్ అలీనే అని పేర్కొన్నారు. జెడ్పీ ఛైర్మన్‌గా ఉన్నప్పుడు కామారెడ్డికి కేవీఆర్ చేసిందేమిటో చెప్పాలని నాయకులు డిమాండ్ చేశారు. ఊరూరా ఏర్పాటు చేసిన ఫిర్యాదు పెట్టెల ద్వారా ఎన్ని సమస్యలు పరిష్కరించారో చెప్పాలన్నారు. కత్తిపోట్ల ఘటనపై నాడు రాష్ట్రంలో పదేళ్లు బీఆర్ఎస్, కేంద్రంలో బీజేపీ ఉందని అప్పుడేం చేశారని ప్రశ్నించారు. కత్తిపోట్ల ఘటనపై మరోసారి మాట్లాడితే ఉరికిస్తామని హెచ్చరించారు. పట్టణ అధ్యక్షుడు పండ్ల రాజు, గుడుగుల శ్రీనివాస్, భిక్కనూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ పాత రాజు, మాచారెడ్డి, నౌశిలాల్, రమేష్ పాల్గొన్నారు.



## ఎమ్మెల్యేపై మాట్లాడే అర్హత కాంగ్రెస్ నాయకులకు లేదు

**అక్షరటుడే, కామారెడ్డి:** ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డిపై మాట్లాడే అర్హత కాంగ్రెస్ నాయకులకు లేదని బీజేపీ నాయకులు అన్నారు. బుధవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యేపై అర్హత లేని నాయకులు అవాకులు, చవాకులు పేలుతున్నారన్నారు. మాజీ డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ రావు ఆర్యవైశ్యులకు చేసిందేమీ లేదన్నారు. వ్యాపారుల వద్ద డబ్బులు తీసుకున్నారని ఆరోపించారు. ఆర్యవైశ్యుల వ్యాపారాల జోలికి వస్తే సహించేది లేదని హెచ్చరించారు. భిక్కనూర్ మాజీ సర్పంచ్ చేసిన ఆరోపణలకు గ్రంథాలయ ఛైర్మన్ స్పందించాలని.. ఆ తర్వాత ఎమ్మెల్యే గురించి మాట్లాడాలని హితవు పలికారు. యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుడుగుల శ్రీనివాస్ చోటా షబ్బీర్ భాయ్ అని అన్నారు. తాము తమ నాయకుడిని తీసుకుని వస్తామని, షబ్బీర్ అలీని తీసుకుని చర్చకు రాగలారా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కౌన్సిలర్లు నరేందర్ రెడ్డి, కుంట లక్ష్మారెడ్డి, శ్రీధర్ రెడ్డి, శ్రీకాంత్, అరవింద్ రాజ్, వినోద, రాహుల్ గౌడ్, భాను ప్రకాష్, నాయకులు భరత్, ప్రవీణ్, రాజు పాటిల్ తదితరులు పాల్గొన్నారు.



## ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు: కలెక్టర్ ఇలా త్రిపాఠి

**అక్షరటుడే, ఇందూరు :** పదో తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. మార్చి 14 నుంచి ఏప్రిల్ 15వ తేదీ వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పదో తరగతి వార్షిక పరీక్షలు కొనసాగుతాయని తెలిపారు. జిల్లావ్యాప్తంగా 24,542 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారన్నారు. 144 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఇంటర్ పరీక్షలు ఈనెల 25 నుంచి మార్చి 18వ తేదీ వరకు ఉన్నాయని, ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయని కలెక్టర్ తెలిపారు. ప్రథమ సంవత్సరం పరీక్షలకు 19,299 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 17,664 మంది విద్యార్థులు హాజరు కానున్నారని వెల్లడించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా జిల్లాలో 58 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఎలాంటి లోటుపాట్లను తావులేకుండా పరీక్షలను సజావుగా కొనసాగేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రశ్నాపత్రాలను ఆయా రూట్‌ల వారీగా పోలీస్ ఎస్కార్ట్ మధ్య తీసుకెళ్లాలని చెప్పారు. పరీక్షలు జరిగే సమయంలో పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి పరీక్షా కేంద్రంలోనూ తప్పనిసరిగా తాగునీటి వసతి అందుబాటులో ఉంచాలన్నారు. పరీక్షలు కొనసాగే సమయాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు రవాణాపరంగా ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరీక్షా సమయాలకు బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రశ్న పత్రాలు, ఆన్సర్ షీట్లను తగిన భద్రత మధ్య తరలించాలని కలెక్టర్ సూచించారు. పరీక్షా కేంద్రాల్లోకి ఎట్టి పరిస్థితుల్లోనూ సెల్‌ఫోన్లను అనుమతించకూడదని ఆదేశించారు. ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీలు చేసిన తరువాతే లోనికి అనుమతించాలన్నారు. ముఖ్యంగా చీఫ్ సూపరింటెండెంట్లు ఎంతో బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఎస్ కిరణ్ కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, ఏసీపీ మస్తాన్ అలీ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కాంటూరు తవ్వకాలతో భూగర్భ జలాలు వృద్ధి: కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** కాంటూరు తవ్వకాలతో భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. సదాశివనగర్ మండలం తిర్మన్‌పల్లి పరిధిలో కాంటూరు కందకాల తవ్వకాల పనులు, అంగన్‌వాడీ, నర్సరీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామ శివారులో సాగుతున్న కాంటూరు కందకాల తవ్వకాలు భూగర్భ జలాల నిల్వలను పెంపొందించడంలో కీలకపాత్ర పోషిస్తాయన్నారు. పనుల నాణ్యత, కొలతలు, సాంకేతిక ప్రమాణాల అమలు వంటి అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. నిర్దేశిత ప్రమాణాల ప్రకారం పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు తాగునీరు, నీడ, ప్రాథమిక వైద్య సదుపాయాలు తదితర వసతులపై ఆరా తీశారు. కార్మికులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలనే దిశగా అధికారులకు సూచనలు ఇచ్చారు. ఉపాధి హామీలో జరుగుతున్న ఈ పనుల ద్వారా నీటి వనరుల అభివృద్ధికి తోడ్పడమే కాకుండా, స్థానికులకు ఉపాధి అవకాశాలు దొరుకుతాయని కలెక్టర్ తెలిపారు. అధికారులు సమన్వయంతో పనిచేసి పనులను వేగంగా జరిగేలా చూడాలన్నారు. అనంతరం కలెక్టర్ తిర్మన్‌పల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. చిన్నారులతో ముచ్చటించిన కలెక్టర్, వారి చదువు, ఆరోగ్యం, పౌష్టికాహారంపై ఆరా తీశారు. ఆటాపాటల ద్వారా బోధన కొనసాగించాలని, ప్రతి చిన్నారిపై ప్రత్యేక



శ్రద్ధ వహించాలని సూచించారు. కేంద్రంలో అందిస్తున్న పౌష్టికాహారం, హాజరు రిజిస్టర్లు, స్టోర్‌రూమ్ నిర్వహణను పరిశీలించి, అన్ని రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. స్టోర్‌రూంలో వస్తువుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు.




## విద్యార్థుల భవిష్యత్‌ను అంధకారం చేయవద్దు..



**అక్షరటుడే, ఆర్మూర్ :** విద్యార్థుల భవిష్యత్‌ను అంధకారం చేయవద్దని సెయింట్ పాల్ హైస్కూల్ ఎదుట విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. ఓ ప్రైవేట్ బ్యాంకు లోన్ రికవరీ పేరుతో పాఠశాల భవనాన్ని జప్తు చేస్తున్నారన్న విషయం తెలుసుకొని బుధవారం విద్యార్థుల తల్లిదండ్రులు పెద్దఎత్తున పాఠశాలకు చేరుకున్నారు. పాఠశాల యాజమాన్యం, ప్రైవేట్ బ్యాంకు ఆర్థిక లావాదేవీలు కోర్టులో చూసుకోవాలని పరీక్షల సమయం సమీపిస్తున్నందున విద్యార్థుల జోలికి రావొద్దన్నారు. సెయింట్ పాల్ స్కూల్‌కు తాళం వేయడం సరికాదన్నారు. స్కూల్ ప్రాంగణంలోకి పోలీసులు చేరుకోవడంతో విద్యార్థులు భయభ్రాంతులకు గురవుతున్నారని పేర్కొన్నారు. క్రెడిట్ స్కోర్ ఆధారంగా అవసరంలేని మొత్తాన్ని నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ లోన్ ఇచ్చిందని సెయింట్ పాల్స్ స్కూల్ యాజమాని ఎనోక్ పాల్ తెలిపారు. వాయిదాల వారీగా చెల్లించాల్సిన మొత్తాన్ని చెల్లిస్తున్నప్పటికీ ప్రైవేట్ బ్యాంకు ఫ్లోటింగ్ రేటు వడ్డీతో అదనపు డబ్బులను వసూలు చేసిందని చెప్పారు. ప్రైవేట్ బ్యాంకు ఆగడాలను చట్టపరంగా ఎదుర్కొనేందుకే రుణ రికవరీ ట్రిబ్యునల్ కోర్టులో పిటిషన్ వేశామన్నారు. ట్రిబ్యునల్ కోర్టు ప్రైవేటు బ్యాంకుకు మార్చి 12లోపు హాజరుకావాలని నోటీసులు జారీ చేసిందన్నారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా పాఠశాల కార్యాలయానికి తాళం వేశారన్నారు. ఈ విషయంలో అనవసర రాద్ధాంతం చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. హైకోర్టు అడ్వకేట్ భానోదయ, పాఠశాల కుటుంబ సభ్యులు సేసిలియా ఎనోక్, కేథరిన్ పాల్ ఉన్నారు.



## తిమ్మాపూర్‌లో అలరించిన కుస్తీ పోటీలు

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని తిమ్మాపూర్ గ్రామంలో కుస్తీ పోటీలు నిర్వహించారు. కొబ్బరికాయ కుస్తీ నుంచి వెండి కడియం కుస్తీ వరకు నిర్వహించిన పోటీలు అందరినీ అలరించాయి. కొబ్బరికాయ కుస్తీ చిన్నారుల మధ్య ఆకట్టుకుంది. ఎల్లారెడ్డి మండలంతో పాటు పిట్లం, మద్నూర్, నారాయణ ఖేడ్, లింగంపేట, బిచ్కుంద, జుక్కల్ ప్రాంతాల నుంచి మల్లయోధులు తరలివచ్చారు. పోటీలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండేందుకు పోలీసులు బందోబస్తు నిర్వహించారు. గెలుపొందిన వారికి గ్రామపెద్దలు నగదును అందజేశారు.



# పాలకవర్గంపై గంపెడాశలు..

కొన్ని నెలలుగా ఖాళీగా మున్సిపల్ పాలకవర్గాలు ఇటీవల కొలువుదీరాయి. ఇన్నిరోజులు ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ కరువై పట్టణంలో సమస్యలు పెరిగిపోయాయి. ప్రత్యేక అధికారుల పాలన వచ్చినప్పటికీ పూర్తిస్థాయిలో సమస్యలు పరిష్కారం కాలేదనే విమర్శలున్నాయి. నూతన పాలకవర్గ సభ్యులు చొరవ తీసుకుంటే తప్ప సమస్యలు పరిష్కారం అయ్యే మార్గాలు కనిపించడం లేదు.

– అక్షరటుడే, కామారెడ్డి

- కామారెడ్డిలో కొలువైన బల్దియా పాలకవర్గం
- పట్టణంలో అస్తవ్యస్తంగా పారిశుధ్య నిర్వహణ
- మొరాయిస్తున్న చెత్త సేకరణ వాహనాలు
- పాములు, పశువులకు ఆవాసాలుగా ప్రకృతివనాలు

కామారెడ్డి మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. వార్డులలో డ్రెయినేజీల్లో పేరుకుపోతున్న చెత్త ఎక్కడికక్కడే ఉండిపోతోంది. గతంలో ఉన్న శానిటరీ ఇన్ స్పెక్టర్ డిప్యుటేషన్ రద్దు చేయడంతో పట్టించుకునే వాళ్లు కరువయ్యారు. వార్డుల్లో చెత్త సేకరణ కోసం తిరిగే వాహనాలు పాతవి కావడంతో ఎక్కడికక్కడ రిపేర్లు వచ్చి షెడ్డులకు చేరుతున్నాయి. పర్యవేక్షణ కొరవడటంతోనే పారిశుధ్య సమస్య తలెత్తుతుందన్న ఆరోపణలున్నాయి.

### ప్రకృతి వనాలపై నిండా నిర్లక్ష్యం..

గత ప్రభుత్వం ప్రజలకు సౌకర్యంగా ఉండేందుకు రూ.లక్ష వెచ్చించి పట్టణంలోని ప్రతి పట్టణ ప్రకృతి వనాలు నిర్మించింది. కొద్దిరోజుల పాటు ప్రజలకు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకున్నా క్రమక్రమంగా పట్టించుకోవడం మానేశారు. ప్రకృతి వనాల నిర్వహణ లేక పాములు, పశువులకు ఆవాసాలుగా మారాయి. వనాల్లో మొక్కలు ఎండిపోయి కళావిహీనంగా మారాయి.

### నూతన పాలకవర్గంపైనే ఆశలు

ఇటీవల మున్సిపల్ ఎన్నికలు ముగిశాయి. నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం పూర్తయింది.చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికయ్యారు. పట్టణంలో నెలకొన్న సమస్యల పరిష్కారం నూతన పాలకవర్గంపై ఆధారపడి ఉందన్న టాక్ వినిపిస్తోంది. బుధవారం నూతన చైర్‌పర్సన్, కౌన్సిలర్లు ఫిల్టర్ బెడ్ పనులను పరిశీలించారు. తాగునీటి సమస్య రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఇదే విధంగా వార్డుల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను గుర్తించి పరిష్కారం చూపాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో బుధవారం ఫేర్‌వెల్ పార్టీ నిర్వహించారు. తొమ్మిదో తరగతి విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు, ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులు, సెకండియర్ స్టూడెంట్లకు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గాంధీ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉత్తీర్ణులు కావాలని సూచించారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జహంగీర్, ప్రియదర్శిని, లక్ష్మణ్ సింగ్, రాజశేఖర్, బలవంత రావు, విద్యారమణ పాల్గొన్నారు.

## కిసాన్‌నగర్‌లో డ్రెయినేజీ పనులు ప్రారంభం



**అక్షరటుడే, బాల్కొండ:** మండలంలోని కిసాన్ నగర్ వడ్డెర కాలనీలో 5వ వార్డులో సీసీ డ్రెయినేజీ, కల్వర్టు పనులకు సర్పంచ్ రామరాజు గౌడ్ భూమిపూజ చేశారు. రూ.3.50లక్షల వ్యయంతో ఈ పనులు చేపట్టారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ స్వామి, ఏఈ షరీఫ్, ఈవో రేణుకాదేవి, వార్డ్ మెంబర్లు లక్ష్మణ్, మోతీరాం, ప్రసాద్, గ్రామ కమిటీ అధ్యక్షుడు హనుమంత్, వడ్డెర సంఘం అధ్యక్షుడు పోశెట్టి, సంఘ సభ్యులు, కాంట్రాక్టర్ వెంకటేష్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన




**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** మండలంలోని పీఎంశ్రీ జడ్పీహెచ్ఎస్ చౌట్‌పల్లి పాఠశాలలో విద్యార్థులు బుధవారం కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల హెడ్మాస్టర్, మండల ఎంఈవో ఆంధ్రయ్య ఆధ్వర్యంలో పాఠశాలలో కెరీర్ గైడెన్స్‌పై తిరునగరి శ్రీహరి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కెరీర్ గైడెన్స్‌తో పాటు, తల్లిదండ్రులు, గురువుల పట్ల ఉండాల్సిన విలువలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, రమేష్, శ్రీనివాస్, బంతిలాల్, రాజు, నగేష్, మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారంలో ముందుంటాం..



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** నగరంలోని డివిజన్లలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని కార్పొరేటర్లు సామల ప్రసన్న సత్యపాల్, ఇప్పకాయల సుమిత్ర కిషోర్ అన్నారు. నూతనంగా కార్పొరేటర్లుగా ఎన్నికైన సందర్భంగా కోటగల్లీలోని మార్కండేయ మందిరంలో వారికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. 48వ డివిజన్ నుంచి కార్పొరేటర్‌గా ప్రసన్న సత్యపాల్, 24వ డివిజన్ నుంచి కార్పొరేటర్ గా సుమిత్ర కిషోర్ విజయం సాధించారు. ఈ సందర్భంగా వారిని పద్మశాలి కులస్తులు ఘనంగా సన్మానించారు.పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలని.. రాబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో పోటీచేసి తమ సత్తాను చాటాలని కార్పొరేటర్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో భీమిర్తి రవి, సురేందర్, సురుకుంట్ల శ్రీనివాస్, శ్రీరామ్ మురళి, దోర్నాల రాజు, బూస రవి, గాలిపల్లి నారాయణ, దోర్నాల సంధ్య, మేక పుష్ప తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇస్తాం



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** అమృత్ పథకంలో భాగంగా పట్టణంలోని 7వ వార్డులో ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇస్తామని మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ మత్తమాల భాగ్యవతి అన్నారు. ఈ మేరకు బుధవారం వార్డులో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఎమ్మెల్యే మదన్ మోహన్ సహకారంతో.. రూ. 35కోట్లతో వార్డుల్లో అమృత్ 2.0 ప్రాజెక్ట్ పనులు జరుగుతున్నాయని ఆమె పేర్కొన్నారు. ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం, నూతన పైప్‌లైన్, నీటిసరఫరా విస్తరణ పనులు వేగవంతంగా నడిచేలా ఎమ్మెల్యే అనునిత్యం అధికారులతో మాట్లాడుతున్నారన్నారు. అలాగే వార్డులోని ప్రజలు తమ ఆధార్ కార్డు చూపించి కుళాయి కనెక్షన్ తీసుకోవాలని సూచించారు. ఆమెతోపాటు మున్సిపల్ కౌన్సిలర్ తిరుపతి, సింగిల్ విండో మాజీ వైస్ ఛైర్మన్ ప్రశాంత్ గౌడ్, ప్యాలాల రాములు ఉన్నారు.

## డీకంపల్లిలో వరిసాగుపై అవగాహన



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ మండలం డీకంపల్లి గ్రామంలో రైతులకు వరిసాగులో ఆధునిక పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ రెడ్డీస్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ తడిపొడి విధానం ద్వారా నీటి వినియోగాన్ని సమర్థవంతంగా నియంత్రించుకోవచ్చని తెలిపారు. నేరుగా వరి విత్తడం ద్వారా కూలీల అవసరం తగ్గడంతో పాటు సాగు ఖర్చులు కూడా గణనీయంగా తగ్గుతాయని వివరించారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగించడం వల్ల దిగుబడి మెరుగుపడటమే కాకుండా భూసారం పెరుగుతుందన్నారు. నూతన సాగు పద్ధతులను అనుసరించడం వల్ల రైతులు సుమారు రూ.8,000 వరకు కూలీ ఖర్చు ఆదా చేసుకోవచ్చని, సాగు సమయం తగ్గిపోవడంతో తదుపరి పంటలకు సమయం దొరుకుతుందని పేర్కొన్నారు. అలాగే నీటి వనరులను సంరక్షించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదం అవుతుందని, చీడపీడల నియంత్రణ సులభతరం అవుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రైనర్ కావేరి,ఏరియా మేనేజర్ రాకేష్, కమ్యూనిటీ ఫెసిలిటేటర్ మధు, అన్వేష్,లీడ్ ఫార్మర్స్ పాల్గొన్నారు.

## ప్రతి ఉద్యోగికి పదవి విరమణ సహజం



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ప్రతి ఉద్యోగికి పదవి విరమణ సహజమని ఉమ్మడిజిల్లా ఆర్‌ఎస్‌సీ బషీరుద్దీన్ అన్నారు. తెలంగాణ మైనారిటీ బాలుర రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపల్ మహమ్మద్ రఫత్ బుధవారం పదవీ విరమణ పొందారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బషీరుద్దీన్ మాట్లాడారు. ఈ సందర్భంగా రఫత్ కళాశాలకు చేసిన సేవలను కొనియాడారు. విద్యార్థుల అభివృద్ధి, క్రమశిక్షణ, విద్యా ప్రమాణాల పెంపులో ఆయన కృషి మరువలేనిదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అధికారులు అహమ్మద్ జియా, హమీద్ వివిధ పాఠశాలలకు చెందిన ప్రిన్సిపాళ్లు కిరణ్ గౌడ్, అర్షి ఇక్బాల్, వెంకట రాములు, ఇంతియాజ్, స్వామి, నాగచారి, ఉపాధ్యాయులు పాల్గొని రఫత్‌ను సన్మానించారు.





## ఘనంగా సాందీపని కళాశాల వార్షికోత్సవం

**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి పట్టణంలోని సాందీపని జూనియర్ కళాశాల 25వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ పైడి ఎల్లారెడ్డి, ప్రముఖ సినీనటుడు, మోటివేషనల్ స్పీకర్ కేవీ ప్రదీప్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల చేసిన నృత్యాలు అందరినీ అలరించాయి. ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని వాటిని సాధించడానికి ప్రయత్నించాలని, భిన్నంగా ఆలోచించి ఆచరణలో పెట్టి విజయం సాధించాలని సూచించారు. పరీక్షలు దగ్గర పడుతున్న సందర్భంలో సమయం వృథా చేసుకోకుండా చదువుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి షేక్ సలాం విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు నైపుణ్యాలను సంపాదిస్తే ఏ రంగంలోనైనా మంచి భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్లు జనార్ధన్, రెడ్డి, పెంటయ్య, అశోక్ రావు, హరిస్మరణ్ రెడ్డి, బాలాజీ రావు, రాజేశ్వరరావు, ప్రిన్సిపాల్స్, ఉపన్యాసకులు, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.